

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

కలెక్టర్ రాజకుమారి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయవద్దని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిడ్తూరు గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ తన భర్త చనిపోయి రెండుసంవత్సరాలు గడిచినా తనకు పింఛన్ రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన రామానాయుడు తనకు ఇంజేడు గ్రామ పరిధిలో 2.15 ఎకరాల భూమి ఉందని, రీ సర్వేలో తన సర్వే నంబర్‌పై మరో రైతు భూమిని కలిపారని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి తాను కొన్న భూమి రిజిస్ట్రేషన్ సమయంలో డిజిటల్ లాక్ తొలగించారని ఫిర్యాదు చేశారు. ఇలా గ్రీవెన్స్‌కు 221 మంది అర్జీలు అందజేశారు.

గర్భాలయ అభిషేకాలు రద్దు

శ్రావణమాసంలోని ప్రత్యేక రోజుల్లో మార్పు...



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

నంద్యాల ఎడ్యుకేషన్ (శ్రీశైలం), జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో శ్రావణమాసంలోని ప్రత్యేక రోజుల్లో గర్భాలయ అభిషేకాలు రద్దు చేస్తామని ఆలయ ఈవో శ్రీనివాసరావు వెల్లడించారు. శ్రావణమాస ఏర్పాట్ల సందర్భంగా ఈవో ఆలయ అధికారులతో పరిపాలనా భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి ఆగస్టు 24వ తేదీ వరకు శ్రావణమాస మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని శ్రావణ శనివారాలు, ఆదివారాలు, సోమవారాలు, వరలక్ష్మీవ్రతం, శ్రావణపౌర్ణమి మొదలైన 16 రోజుల పాటు గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలిపేస్తామన్నారు. మిగిలిన రోజుల్లో అన్ని అభిషేకాలు కొనసాగుతాయన్నారు. రద్దీ రోజుల్లో రోజుకు మూడు పర్యాయాలు మాత్రమే స్పర్శదర్శనం ఉంటుందని, ఆగస్టు 15 నుంచి 18 వరకు స్పర్శదర్శనం పూర్తిగా నిలిపేస్తామని అన్నారు.

నేటి టీడీపీ సమావేశం వాయిదా

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించాల్సిన టీడీపీ జిల్లా స్థాయి సమావేశం వాయిదా వేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలం పర్యటన నేపథ్యంలో సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని, తదుపరి తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు గమనించాలన్నారు.





ముందుగానే...!

- నేడు శ్రీశైలం డ్యాం నుంచి నీటి విడుదల
- గేట్లను ఎత్తనున్న సీఎం చంద్రబాబు
- ఎగువ నుంచి భారీ వరద ప్రవాహం
- ఇప్పటికే నీటి లభ్యత.. 192.5300 టీఎంసీలు
- 880.80 అడుగులకు చేరిన నీటి మట్టం
- మల్లన్న దర్శనం తర్వాత కృష్ణమ్మకు సీఎం జలహారతి

నంద్యాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వరాలకు కృష్ణానది పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నడూ లేని విధంగా దాదాపుగా నెల రోజుల ముందుగానే ఇప్పటికే జలాశయంలో నీటి లభ్యత 192.5300 టీఎంసీలు ఉండగా.. నీటి మట్టం 880.80 అడుగులకు చేరింది. వీటితో పాటు విద్యుత్ ఉత్పాదన కింద జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 67,433 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జలాశయంలోకి పెద్దఎత్తున నీరు వచ్చి చేరడంతో శ్రీశైల జలాశయంలో కృష్ణమ్మ ఉప్పొంగుతోంది. 215 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీశైల జలాశయంలో ఇప్పటికే సుమారు 193 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ అధికారులు గేట్లు ఎత్తివేసేందుకు సిద్ధమయ్యారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జలాశయం గేట్లు ఎత్తి కృష్ణా జలాలను దిగువన నాగార్జున సాగర్‌కు విడుదల చేయనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు సీఎం చేతులు మీదుగా కృష్ణా జలాలను విడుదల చేయడం ఉమ్మడి జిల్లా ప్రజలతో పాటు కూటమి శ్రేణుల్లో ఆనందోత్సవం మొదలైంది.

ఎగువ నుంచి భారీగా..

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం జోరందుకుంది. దీంతో జలాశయం పూర్తి లెవల్(ఎఫ్ఆర్ఎల్) 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 881 అడుగులకు చేరింది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1.80 లక్షల క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 23 వేల క్యూసెక్కులు రాయలసీమ ప్రాజెక్టులకు వెళ్తున్నాయి. మరో 70 వేలు కుడి ఎడమ జల విద్యుత్ ఉత్పాదన కింద నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎగువన కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల జలాశయాలు దాదాపుగా నిండిపోయాయి. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు తుంగ భద్ర నుంచి 65 వేల క్యూసెక్కుల మేర శ్రీశైలానికి జలాలు వచ్చి చేరుతున్నాయి.

మిగతా 6వ పేజీలో



నీటి విడుదలకు నిర్ణయం

- ఎల్లెల్సీకి 10న , కేసీకి 14న, హంద్రీ నీవాకు 15న కృష్ణా జలాలు
- కరువు నివారణకు శాశ్వత పరిష్కారం గుండ్రేవుల శరణ్యం
- కర్నూలు జిల్లా ఐఏబీ సమావేశంలో కీలక తీర్మానాలు

కర్నూలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయకట్టు రైతులకు తీపి కబురు అందింది. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు ఈ నెల 10వ తేదీ నుంచి, కేసీ కాలువకు 14 నుంచి సాగునీరు ఇవ్వాలని జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ)లో నిర్ణయించారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కలెక్టరు పి. రంజిత్‌బాషా అధ్యక్షత ఐఏబీ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గౌరు చరితమ్మ, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తదితరులు హాజరు అయ్యారు. జిల్లాలో తుంగభద్ర జలాశయం, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద పోటెత్తడంతో ముందుగా పాలికేళ్ల తరువాత జూలై మొదటి వారంలో గేట్లు ఎత్తి దిగువకు సాగునీరు విడుదల చేస్తున్నారు. జిల్లాలో వర్షాలు ఆశాజనంగా లేకపోయినా, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ముందుగానే జలాశయాలు నిండడం వల్ల ఆయకట్టుకు సాగునీటి విడుదలపై ఐఏబీ సమావేశం నిర్వహించారు. సాగునీటి విడుదలతో పాటు పలు కీలక అంశాలపై చర్చించారు. నగరంలో హంద్రీ నది మురికి కూపంగా మారిందని, దోమలకు నిలయంగా మారడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చర్చ జరిగింది. మురుగునీరు కొట్టుకుపోయేలా హంద్రీ నీవా కాలువ నుంచి హంద్రీకి నీరు విడుదల చేయాలని ఎమ్మెల్యేలు గట్టిగా డిమాండ్ చేశారు. కలెక్టరు కూడా సానుకూలంగా స్పందించి తీర్మానం చేశారు.



ముఖ్యంగా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం, కర్నూలు నగరం సాగునీటికి శాశ్వత పరిష్కారం జరగాలంటే గుండ్రేవుల జలాశయం నిర్మాణం ఒక్కటే ఏకైక మార్గమని ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, కేసీ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పరమేశ్వరరెడ్డి గట్టిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు వీలుగా తీర్మానం చేశారు. ఇలా పలు అంశాలపై తీర్మానాలు చేశారు.

గంగమ్మ చెరువుపై తక్షణ చర్యలు తీసుకోండి

జాతీయ హరిత ట్రిబ్యూనల్ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్) తీర్పు కాపీ తెప్పించుకొని బి. తాండ్రపాడు గంగమ్మ చెరువుపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా కర్నూలు ఆర్డీఓ కె.సందీప్‌కుమార్‌ను ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యత సమస్యగా తీసుకోవాలని స్పష్టం చేశారు. దాదాపు రూ.120 కోట్లు విలువ చేసే గంగమ్మ చెరువు ఫోర్‌షోర్ ఏరియాలో 12 ఎకరాలు వైసీపీ హయాంలో అప్పటి పాలకుల అండదండలతో కొందరు ఆక్రమించి ఎర్రమట్టితో పూడ్చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వెంచర్లు వేశారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశారు.


మిగతా 7వ పేజీలో

పీజీ, బీటెక్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో పీజీ, బీటెక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పీజీ 4వ సెమిస్టర్‌లో 489 మందికి 415, బీటెక్‌లో 243 మందికి గాను 241 మంది పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వీసీ వి.వెంకటబసవ రావు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్ పలు సెంటర్లను పరిశీలించారు.

Ørvakallu industrial node:

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం తుది మాస్టర్ ప్లాన్ నోటిఫై చేసింది. హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెబీఐసీ)లో భాగంగా ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఐసీడీఏ) తీర్మానం మేరకు సోమవారం పరిశ్రమలు, వాణిజ్యం శాఖ కార్యదర్శి జీవో ఎంఎస్ నంబరు.121 ద్వారా నోటిఫికేషన్ జారీ చేశారు. ఏడు గ్రామాల పరిధిలో ప్రణాళిక ప్రకారం 5,017 ఎకరాలు(52 శాతం) పారిశ్రామిక అభివృద్ధి, 4,702 ఎకరాల్లో (48 శాతం) నివాస, వాణిజ్య సముదాయం, రవాణా, ప్రజా అవసరాలు, సెమీ పబ్లిక్ అవసరాలు, పచ్చదనం, నీటి వనరులు అభివృద్ధి చేస్తారు. ఇప్పటికే ఏపీఐఐసీ మౌలిక వసతుల కోసం రూ.1,100 కోట్లతో టెండర్లు పిలిచారు. తుది మాస్టర్ ప్లాన్ నోటిఫై చేయడంతో పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకునే అకాశం ఉంది.



ఓర్వకల్లు నోడ్ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ మ్యాప్

జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ



కీలక అడుగు..!

- హైదరాబాద్ - బెంగళూరు కారిడార్‌లో భాగంగా 9,718.84 ఎకరాల్లో అభివృద్ధి
- ఓర్వకల్లులోని ఏడు గ్రామాల పరిధిలో విస్తరణ
- తుది నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- మౌలిక వసతుల కల్పనకు రూ.1,100 కోట్లతో టెండర్లు

కర్నూలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత కొలువుదీరిన చంద్రబాబు ప్రభుత్వం రాయలసీమ ప్రాంతంలో కరువు, వలస నివారణకు పారిశ్రామిక వాడ, హార్టికల్చర్ హబ్, సీడ్ హబ్‌గా అభివృద్ధి సంకల్పంతో అడుగులు వేసింది. అందులో భాగంగా ఓర్వకల్లు కేంద్రంగా 33 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రపంచంలోనే తొలి వెయ్యి వాట్లతో మెగా సోలార్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. 5,230 మెగా వాట్లలో ఇండిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు (ఐఆర్‌ఈపీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక ప్రగతి పడకేసింది. 2024లో సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు మళ్లీ జీవం వచ్చింది. హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా ఓర్వకల్లు నోడ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించింది. 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌ను రూ.2,786 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు రాబట్టి, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యం. తొలి విడతగా ఇప్పటికే రూ.1,100 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్.. వంటి మౌలిక వసతుల కల్పనకు టెండర్లు పిలిచారు.


గ్రామాల వారిగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి వివరాలు (ఎకరాల్లో)

విభాగం	ఫేజ్-1	ఫేజ్-1	మొత్తం	శాతం
పరిశ్రమలు	1,423.73	3593.59	5,017.33	52
రవాణా	216.6	258.17	474.77	5
నివాస స్థలం	41.98	294.38	336.36	3
వాణిజ్య సముదాయం	17.56	188.86	206.42	2
ప్రజా, సెమీ పబ్లిక్	64.49	136.32	200.81	2
ప్రజా వినియోగం	217.35	239.35	456.7	5
రహదారులు	276.4	621.64	898.04	9
వినోద కేంద్రాలు	363.04	849.56	1,212.6	12
పచ్చని ప్రాంతాలు	–	510.18	510.18	5
నీటి సౌకర్యం	–	405.63	405.63	4
మొత్తం	2,621.15	7,097.68	9,718.84	100

తుది మాస్టర్ ప్లాన్ నోటిఫై చేసిన ప్రభుత్వం

ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణంలో మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకం. పరిశ్రమల స్థాపనతో పాటు నివాసాలు, వాణిజ్య సముదాయాలు, రవాణా, ప్రజా, సెమీ పబ్లిక్ సౌకర్యాలు, వినోదం, పచ్చదనం.. వంటివి ఎంతో కీలకం. గుట్టపాడు, పుడిచెర్ల, కన్నమడకల, బ్రాహ్మణపల్లె, సోమయాజులపల్లె, కొమ్మరోలు బీట్-1, కొమ్మరోలు బీట్-2 ఏడు గ్రామాల పరిధిలో ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌ను 9,719.84 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్నారు.

మిగతా 6వ పేజీలో



ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌లోని గుట్టపాడు క్లస్టర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు

వర్షాకాలం వచ్చిందంటే తుంగభద్ర నది అవతల వైపు ఉన్న గ్రామాల ప్రజలకు కష్టాలు మొదలయినట్లే. శ్రమ చేసుకొని జీవించే కూలీలు, చదువుకొనే పిల్లలు, ఇతరత్రా పనుల మీద కర్నూలుకు రావాలంటే నదిలో ఒక కిలో మీటరు మేర నాటు పడవల మీద, కాలినడకన ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడవాల్సి వస్తోందని కర్నూలు మండలంలోని దాదాపు 10 గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

\- కర్నూలు అగ్రికల్చర్ (ఆంధ్రజ్యోతి)



నదిలో ప్రమాదం లెక్క చేయకుండా నది దాటుతున్న దృశ్యం

తీరని కష్టాలు

60 వేల జనాభాకు దినదిన గండం

కర్నూలు మండలంలోని గొందిపర్ల, దేవమాడ, దొడ్డిపాడు, పూలతోట, సుందరయ్యనగర్, వసంతనగర్, తాండ్రపాడు, బసాపురం, భైరాపురం, కాశాపురం, ఎస్ఆర్‌పీఎం క్వార్టర్స్, సింగవరం తదితర 20 గ్రామాల ప్రజలు గొందిపర్ల నుంచి కర్నూలుకు తుంగభద్ర నదిపై బ్రిడ్జి ఏర్పాటుకు కళ్లల్లో ఒత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. ఈ గ్రామాల మనుగడ కర్నూలు నగరంపైనే ఆధారపడి ఉంది. బ్రిడ్జి ఏర్పాటు కాకపోవడం వల్ల ఆ గ్రామాల ప్రజలు వర్షాకాలంలో నదిలో నీటి ప్రవాహం ఉన్నప్పుడు దాదాపు 30 కి.మీ. చుట్టూ తిరిగి పంచలింగాల మీదుగా కర్నూలుకు చేరుకుంటున్నారు.



25 సంవత్సరాల నుంచి హామీలకే పరిమితం

గొందిపర్ల నుంచి కర్నూలుకు తుంగభద్ర నదిపై బ్రిడ్జి నిర్మిస్తామని గత 25 సంవత్సరాలుగా రాజకీయ నాయకులు హామీలు ఇస్తూనే ఉన్నారు. కానీ సమస్య పరిష్కారం కావడం లేదు. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు మాత్రమే ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజల కష్టాలు ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు గుర్తుకొస్తున్నాయి.

మళ్లీ మొదలవుతున్న ఆందోళనలు, ఉద్యమాలు

గతంలో గొందిపర్ల బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా ప్రజా సంఘాలు ఆందోళనలు, ఉద్యమాలకు శ్రీకారం చుట్టాయి. తిరిగి మళ్లీ ఇప్పుడు ఆందోళనలు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



బ్రిడ్జి నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలి

ఎన్నో ఏళ్లుగా గొందిపర్ల బ్రిడ్జి నిర్మాణం కోసం రైతు సంఘంతో పాటు వివిధ ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. ఇప్పటికైనా గొందిపర్ల బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలి.

\- రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రూ.130 కోట్ల నాబార్డు నిధులేమయ్యాయో..?

బ్రిడ్జి నిర్మాణం ఫైలు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ

ఇప్పటి దాకా గొందిపర్ల బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు కర్నూలు నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగాయి. ఐదు సంవత్సరాల క్రితం నీటి పారుదల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ పనుల నివేదికను మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. కర్నూలు నగరంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికే ఇప్పటి వరకు మోక్షం లేదు. ఈ పరిస్థితుల్లో కోట్ల ఖర్చు అయ్యే గొందిపర్ల బ్రిడ్జి నిర్మాణ పనులను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎప్పుడు ప్రారంభిస్తారో.. నిధులెప్పుడు ప్రభుత్వం నుంచి తీసుకువస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తుంగభద్ర నదిపై బ్రిడ్జిని నిర్మించేందుకు నాబార్డు రూ. 130 కోట్లను మంజూరు చేశారు. అయితే వివిధ కారణాల వల్ల బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టలేకపోయామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

- గొందిపర్ల నుంచి కర్నూలు బ్రిడ్జికి మోక్షమెన్నడు..?
- 60వేల జనాభాకు దినదినగండం
- నదికి వరద వస్తే.. ఆ గ్రామాల ప్రజలకు పస్తులే





నదికి వరద వస్తే.. మాకు పస్తులే

తుంగభద్ర నదికి వరద వస్తే కూలి ఇతరత్రా పనులు చేసుకొనే మాలాంటివాళ్ల జీవనోపాధికి గండిపడినట్లే. నేను కారు మెకానిక్‌ను. వర్షం లేని సమయంలో నదిని దాటి కర్నూలు వచ్చి మెకానిక్‌గా పని చేసుకుంటా. వర్షం రాక మొదలేతే ఇక నా పని అంతే. కుటుంబమంతా పస్తులుండాల్సిందే.

\- సందీప్, కారు మెకానిక్

కువైట్‌లో ఉద్యోగావకాశాలు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ రంగంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ, ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆధ్వర్యంలో థట్‌రుయా భాగస్వామ్యంతో కువైట్‌లో నిర్మాణ రంగంలో ఉద్యోగాల కోసం అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఏపీకి చెందిన అనుభవజ్ఞులైన నిర్మాణ కార్మికులకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ వర్క్‌లో డిప్లొమా కలిగి ఉండాలని, మూడేళ్లకు పైగా ఐదేళ్ల అనుభవం ఉన్న 25 నుంచి 50 ఏళ్ల వయస్సు కల్గిన పురుష అభ్యర్థుల నుంచి రెండేళ్ల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.56వేల నుంచి రూ.70వేల వరకు వేతనం ఉంటుందని చెప్పారు. వీసా ప్రాసెసింగ్, విమాన టిక్కెట్లు, వైద్యసదుపాయాలు, నివాసం వంటి ఏర్పాట్లు కంపెనీ వారే చూసుకుంటారని తెలిపారు. అభ్యర్థులు పాస్‌పోర్ట్, ఐటీఐ, డిప్లొమా సర్టిఫికెట్ పత్రాలు సమర్పించాలని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కీలక అడుగు..!

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)లో భాగంగా అభివృద్ధి చేసే ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ), కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఈ ఏడాది మార్చి 7న జీవోఎంస్ నంబరు.30 జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబరు.121 ద్వారా తుది మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ జారీ చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మౌలిక వసతులకు టెండర్లు పిలిచాం

హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ తుది మాస్టర్ ప్లాన్ నోటిఫై చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ క్లస్టర్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్.. వంటి కనీస సౌకర్యాలు కల్పించేందుకు రూ.1,100 కోట్లతో టెండర్లు పిలిచాం. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే పనులు చేపడతాం. ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు.

\- మధుసూదన్‌రెడ్డి, ఏపీఐఐసీ జోన్ మేనేజర్, కర్నూలు

ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం



వైసీపీ హయాంలో అప్పటి పాలకులు సృష్టించిన విధ్వంసం వల్ల రాష్ట్రంలోని ఉన్న పరిశ్రమలే ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇవ్వడంతో వివిధ పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు నోడ్ అభివృద్ధి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. పరిశ్రమల శాఖ మంత్రిగా నేను నిత్యం సమీక్ష చేస్తున్నాను. ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేయాలంటే మాస్టర్‌ప్లాన్ ఎంతో ముఖ్యం. ఓర్వకల్లు నోడ్ తుది మాస్టర్ ప్లాన్‌ను నోటిఫై చేస్తూ జీవో నంబరు.121 జారీ చేయడం మా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అయినట్లే.

\- టీజీ భరత్, పరిశ్రమల శాఖ మంత్రి

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

- వార్డెన్లు పనిచేసే చోటనే నివాసముండాలి
- వసతి గృహాల్లో విధిగా మెనూ పాటించాలి
- 'ఆంధ్రజ్యోతి' తో డీబీసీడబ్ల్యూవో ప్రసూన



డీబీసీ డబ్ల్యూవో ప్రసూన

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లోని వార్డెన్లు నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సాధికారిత అధికారి (డీబీసీడబ్ల్యూవో) ప్రసూన అన్నారు. విద్యార్థులకు మెనూను పక్కగా అమలు చేయాలని ఆదేశించారు. హాస్టల్ వార్డెన్లు పని చేసే చోటనే నివాసం ఉండాలని ఆదేశించారు. లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో 31 ప్రీమెట్రిక్ హాస్టల్స్ ఉన్నాయని, ఈ హాస్టల్స్‌లో 4127 మంది విద్యార్థులు, 16 పోస్టు మెట్రిక్ హాస్టల్స్ ఉండగా వీటిలో 1427 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆమె అంశాలపై మాట్లాడారు.

ప్రశ్న: వసతి గృహాల్లో ప్రవేశాలు ఎలా ఉన్నాయి?

జవాబు: హాస్టల్‌లో ప్రవేశాల కోసం విద్యార్థులు అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ జిల్లా వెనుకబడిన ప్రాంతం. అధిక సంఖ్యలో పిల్లల తల్లిదండ్రులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పించాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లకు, వార్డెన్స్‌ను ఆదేశించాం. కంబలపాడు, వెల్దుర్తి, ఎమ్మిగనూరు, కర్నూలు వసతి గృహాల్లో అదనపు సౌకర్యాల కోసం అద్దె భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రశ్న: మూసిన హాస్టళ్లను మళ్లీ తెరుస్తారా?

జవాబు : కర్నూలులో మూసివేసిన డీఎన్‌టీ హాస్టల్స్‌ను తెరిపించాం. ఇప్పటికే 62 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాం. గతంలో మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరుకు వసతి గృహం తరలించాం. దీన్ని మంత్రాలయానికి షిఫ్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. క్రిష్ణగిరి మండలంలోని ఎరుకుల చెరువులో మూసివేసిన హాస్టల్ స్థానంలో కటారుకొండలో ఏర్పాటుచేసేందుకు వేగంగా చర్యలు జరుగుతున్నాయి..

ప్రశ్న: వార్డెన్లు అవినీతికి పాల్పడున్నారనే ఆరోపణలు ఉన్నాయి?

జవాబు : వసతి గృహాల్లో గతంలో మాన్యువల్ విధానంలో విద్యార్థుల హాజరు శాతం వేసేవారు. ఈ విధానానికి చెక్ పడింది. ఫేషియల్ యాప్‌తో విద్యార్థుల హాజరును ప్రతి రోజూ ఆన్‌లైన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బోగస్ హాజరుకు అవకాశముండదు.

ప్రశ్న: జిల్లాలో వార్డెన్ల కొరత ఉందా?

జవాబు : 31 ప్రీమెట్రిక్ హాస్టళ్లకు గానూ 8మంది రెగ్యులర్ వార్డెన్లే పని చేస్తున్నారు. అయితే ఉన్నవారికే ఇన్‌చార్జిలను కేటాయించాం.

ఫిర్యాదులన్నింటినీ త్వరగా విచారిస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం త్వరగా విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 85 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్ తన మొబైల్‌కు రావడంతో తెలియక నేను క్లిక్ చేశానని, పైగా తన ఫోన్‌లో ఉన్న గ్రూపుల్లోకి కూడా తన ప్రమేయం లేకుండానే ఏపీకే ఫైల్ వెళ్లిందని తెలిపారు. తర్వాత నా ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.1.96 లక్షలు పోయానీ న్యాయం చేయాలని కల్లూరు మండలం చెందిన ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. కర్నూలులోని ఏదో ఒక స్కూల్‌లో బయాలజీ టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలుకు చెందిన లక్ష్మయ్య రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు తిలక్‌నగర్‌కు చెందిన యువరాజు ఫిర్యాదు చేశారు.

బెంగళూరు ఆరిజనో ఇన్ఫో టెక్నాలజీ సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అనంతపురం చెందిన బాబు తమకు శిక్షణ ఇప్పించి ప్రాజెక్టు వర్కు పేరుతో రూ2.లక్షలు తీసుకొని మోసం చేశారని కర్నూలు ముజఫర్‌నగర్‌కు చెందిన అభిలాష్ ఫిర్యాదు చేశారు. వర్క్ ఫ్రమ్ హోం పేరుతో 6 నెలల పాటు పని చేయించుకుని ఒక నెల మాత్రమే జీతం డబ్బులు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వడ్డెగేరికి చెందిన ఖాజా ఖాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో తన భర్త పేరుతో ఫేక్ ఐడీ సృష్టించి ప్రముఖులను దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని కర్నూలుకు చెందిన షసియా ఫిర్యాదు చేశారు.

120 ఎకరాల తన పొలాన్ని జిల్లా సర్వేయర్ కొలతలు వేసినా కూడా ఉగాది జయన్న దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడని కర్నూలు ప్యాలకుర్తికి చెందిన పెరుగు నగేష్ ఫిర్యాదు చేశారు. నంద్యాల ఆటోనగర్‌కు చెందిన కురువ ఈరన్న ధరణి ఆటో గ్యారేజీలో పని చేస్తూ తమ ట్రాక్టర్ ఇంజిన్‌కు నెలకు రూ.20వేలు బాడుగకు ఇస్తానని తీసుకెళ్లి 8 నెలలు అయిందని, ట్రాక్టర్‌తో పాటు ఎక్కడికి వెళ్లిపోయాడో తెలియడం లేదని ఆదోని ఇస్వి గ్రామానికి చెందిన రామాంజనేయులు, మల్లప్ప ఫిర్యాదు చేశారు. నకిలీ డెత్ సర్టిఫికెట్లు సృష్టించి, దొంగ రిజిస్ట్రేషన్‌తో ఆస్తి మొత్తాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు కుమ్మరి వీధికి చెందిన రాకేష్ ఫిర్యాదు చేశారు.



నాన్న కష్టం బండెడు..!

పై ఫోటోలో ఉన్న వ్యక్తి పేరు శాంసన్. ఈయనది నందవరం గ్రామం. వ్యర్థాలు సేకరించి వాటితో వచ్చే ఆదాయంతో పిల్లలను మంచిగా చదివిస్తున్నాడు.. కష్టాన్ని నమ్ముకొని జీవన ప్రయాణాన్ని ఓ బండిపై కొనసాగిస్తున్నాడు. ప్రతి రోజు టీవీఎస్ వాహనంపై మంత్రాలయానికి వచ్చి వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ వస్తువులు, పడేసిన వ్యర్థ పదార్థాలు సేకరిస్తాడు. వాటిని అదే వాహనంపై ఎమ్మిగనూరుకు తీసుకెళ్లి అక్కడ పాత సామాన్లు కొనేవారికి అమ్మి జీవనం సాగిస్తున్నాడు. ఉదయం 4 గంటలకు మంత్రాలయం వచ్చి సాయంత్రం 4గంటలకు అమ్మేసి రోజూ రూ.1,600 సంపాదిస్తున్నాడు. భార్య మార్తమ్మ పొలం పనులకు వెళ్లగా రూ.250 కూలి వస్తుంది. ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉంది. పెద్ద కొడుకు డోన్‌లో ఇంటర్ ఎంపీసీ సెకండియర్ చదువుతున్నాడు. చిన్నకుమారుడు నందవరం జడ్పీహెచ్ఎస్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. కుమార్తె శాంతి కర్నూలులోని విశ్వభారతి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. ఏడాదికి రూ.1.10 లక్షలు ఖర్చు చేసి ముగ్గురు పిల్లలను విద్యాధికులను చేసేందుకు కృషి చేస్తున్నాడు.

- మంత్రాలయం, ఆంధ్రజ్యోతి

ముందుగానే..!



5వ పేజీ తరువాయి

తుంగభద్రలో ఒక గేటు బలహీనంగా ఉండటంతో పూర్తి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలకు గాను. ప్రస్తుతం 80 టీఎంసీలు మాత్రమే నిల్వ చేయడానికి జలాశయం ఇంజనీర్లు నిర్ణయించారు. తుంగ భద్ర నీటి నిల్వ ప్రస్తుతం 78 టీఎంసీలకు చేరింది. సోమవారం సాయంత్రం ఎగువ నుంచి వచ్చే 73 వేల క్యూసెక్కులను దిగువన శ్రీశైలానికి విడుదల చేస్తారు.

సీఎం వెంట మంత్రులు, ఎమ్మెల్యేలు

శ్రీశైల జలాశయం నీటి విడుదల కోసం ఏకంగా సీఎం చంద్రబాబు రావడం చర్చనీయాంశంగా మారింది. సోమవారం సాయంత్రం సీఎం పర్యటన వివరాలను సీఎంఓ వెల్లడించింది. దీంతో నంద్యాల కలెక్టర్ రాజకుమారి, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణాలతో పాటు జలాశయం ఎస్ఈ రామచంద్రమూర్తి అప్రమత్తమయ్యారు. వెంటనే సీఎం పర్యటన పనుల్లో నిమగ్నమయ్యారు. సీఎంతో పాటు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉమ్మడి జిల్లా మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఇరిగేషన్ అధికారులు హాజరుకానున్నారు.

పటిష్ట భద్రత

సీఎం చేతులు మీదుగా శ్రీశైలం జలాశయం నీటి విడుదల నేపథ్యంలో కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా నేతృత్వంలో 1,300 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం నుంచే భద్రతను కట్టుదిట్టం చేశారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 9మంది డీఎస్పీలు, 35 మంది సీఐలు, 75మంది ఎస్ఐలు, 180మంది హెడ్ కానిస్టేబుళ్లు మొత్తం 1,300 మందితో సీఎం పర్యటనకు సిబ్బందిని సమకూర్చారు. సీఎం భద్రతా సిబ్బంది కూడా నిఘా ఉంచారు. ఇదిలా ఉండగా ఏపీ, తెలంగాణ నుంచి శ్రీశైలానికి వచ్చే భక్తులకు ఉదయం 9 గంటల నుంచి మధ్నాహ్నం 2 గంటలకు వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సీఎం పర్యటన నేపథ్యంలో దోర్నాలలో కాసేపు సాధారణ వాహనాలను నిలుపుదల చేస్తారు. అదే విధంగా దేవస్థానం, డ్యాం పరిధిలోనూ ఆంక్షలు కొనసాగుతాయి.

11 గేట్లు ఎత్తివేత..!

శ్రీశైలం జలాశయంలో ఉన్న 12 క్రస్ట్ గేట్లలో 11 గేట్లను సీఎం చంద్రబాబు ఎత్తనున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. ఇటీవల సాగునీటి రంగ సలహాదారు, గేట్ల నిపుణులు కన్నయ్య నాయుడు సైతం ఇటీవల పర్యటించి 12 గేట్లలో 10 గేటు స్వల్పంగా దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. ఇదే క్రమంలో మరో ఐదేళ్లకయినా కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా 6,7వ గేటు కింద ఉన్న ప్లంజ్ పూల్ కొంత దెబ్బతినడంతో ఆ గేట్లను ఎత్తుతారా..? లేదా అన్న సందేహాలు లేకపోలేదు.

తల్లికి వందనం రెండో జాబితా సిద్ధం చేయండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం రెండో జాబితాను ఈనెల 10వ తేదీలోగా సిద్ధం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లికి వందనం రెండో విడత జాబితాను 10వతేదీలోగా సిద్ధం చేయాలని, కొత్తగా అంగన్‌వాడీ నుంచి 1వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు, ఐదో తరగతి నుంచి ఆరో తరగతిలో చేరిన విద్యార్థులు, 10వ తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులను జాబితాలో చేర్చి తల్లికి వందనం పథకం అందేలా చూడాలన్నారు. తల్లిబ్యాంక్ ఖాతా, ఆధార్ అనుసంధానం గురించి విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలున్నా గ్రామ సచివాలయ కోఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి పెండింగ్ ఇనామ్ భూముల వివరాలు, తహసీల్దార్, ఆర్డీవోలు సంబంధిత సైట్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అధిక వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిశుభ్రత, ప్రజారోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పీ4(పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్ పార్టనర్ షిప్)కు సంబంధించి జిల్లాలో నమోదైన బంగారు కుటుంబాలకు అధికారులు మార్గదర్శకులై చేయూతనివ్వాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్‌లో భాగంగా కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు పాణ్యం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి. నవ్య తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గ రాజకీయ పార్టీ ప్రతినిధులు, తహసీల్దార్ల సమావేశం నిర్వహించారు. ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఒక పోలింగ్ స్టేషన్‌లో 1,200 ఓట్లు మాత్రమే ఉండాలని, అంతకుమించి చినప్పుడు వేరొక సమీప పోలింగ్ స్టేషన్‌లోకి మార్చడం గానీ, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటు గానీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం కల్లూరు మండలంలో 14, ఓర్వకల్లు మండలంలో 4, పాణ్యం మండలంలో 1 పెరిగాయని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. కొత్తగా పెరిగిన పోలింగ్ స్టేషన్‌లు అన్నీ దాదాపు ఒకే భవన సముదాయంలో వేరే గదిలో ఉంటాయని తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో అతిపెద్ద నియోజకవర్గం పాణ్యం అని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, ఓటు వేయడానికి వాహనాలు తిరిగే రోడ్డు దాటి వెళ్లకుండా చూడాలని, వీలైనంత వరకు ప్రజలకు నడిచి వెళ్లేంత దగ్గరలో పోలింగ్ స్టేషన్ ఉండేలాగా చూడాలని ఎలక్టోరల్ అధికారిని కోరారు. ఈ సమావేశంలో కల్లూరు తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఓర్వకల్లు తహసీల్దార్ బీవీఎన్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్, జూలై 7 ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ నల్లప్ప తెలిపారు. వివరాల మేరకు.. ఈనెల 4న సి.బెళగల్ మండలానికి చెందిన బాలిక తన తల్లికి ఎమ్మిగనూరులో ఆసుపత్రిలో చికిత్స చేయించిన అనంతరం తిరుగు ప్రయాణంలో తప్పిపోయి ఆదోనికి చేరింది. ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన ఆటోడ్రైవర్ రమేష్ మాయమాటలు చెప్పాడు. తన అక్క ఇంటికి తీసుకెళ్తానని నమ్మించి ఆదోని-ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక రోదిస్తుండటంతో ఆదోనిలోని హాస్టల్‌లో వదిలేందుకు ప్రయత్నించాడు. అనుమానం వచ్చిన పోలీసులు బాలికను విచారించారు. నిందితుడిని అదుపులో తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు


నిందితులను చూపుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో సుదిరెడ్డిపల్లె గ్రామంలో ఈ నెల 1వ తేదీన జరిగిన కురువ శేషన్న హత్య కేసులో నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితులు పరశురాముడు, విజయకుమార్, గోవిందు, బీసన్నను అరెస్టు చేసి డీఎస్పీ ఎదుట హాజరు పరిచారు. శేషన్న పరశురాముడు భార్యను లైంగికంగా వేధిస్తుండటంతో పాటు తరచూ అవమానపరుస్తుండేవాడు. దీంతో కక్ష పెంచుకున్న అన్నదమ్ములందరూ శేషన్నను ఈ నెల 1వ తేదీ సాయంత్రం ఆయన కూతురు ఇంట్లో ఉండగా.. దాడి చేశారు. శేషన్న కుడి కాలును నరికి ఊరంతా ఊరేగించారు. తీవ్ర రక్తస్రావమై శేషన్న మృతి చెందాడు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. తాలుకా సీఐ శ్రీధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బైకులు ఢీ.. ఐదుగురికి గాయాలు

పత్తికొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండగిరి గ్రామం వద్ద రెండు బైకులు ఢీకొని ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. మండగిరి గ్రామానికి చెందిన చింటూ, సాయి, అజయ్ బైక్‌పై మొహర్రం వేడుకల్లో భాగంగా బయటకు వచ్చారు. అయితే జె.అగ్రహారం గ్రామం నుంచి మండగిరి వైపు మరో బైక్‌లో వస్తున్న గోవిందు, రామన్న బైక్ వస్తుండగా రెండు బైకులు ఢీకొని, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన వారు పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం, వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- అయ్యలూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ

నంద్యాల టౌన్ జూలై 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం అయ్యలూరు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రవరం మండలం యల్లావత్తుల గ్రామానికి చెందిన రమేశ్, (ఆర్ఎంపీ వైద్యుడు) మరో యువకుడు ఇద్దరు ఒకే ద్విచక్ర వాహనంపై నంద్యాల వైపు వస్తుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ తెలిపారు. గుర్తించిన స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వసతి గృహాల తనిఖీ

కర్నూలు లీగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు వసతి గృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి సోమవారం తనిఖీ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ వసతి గృహాలను, ఆనంద నిలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందిస్తున్న భోజన వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయం రికార్డులను తనిఖీ చేశారు.

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు ఇన్‌స్పెక్టర్‌గా హాశ్వంత్ కుమార్



ఓర్వకల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నూతన ఇన్‌స్పెక్టర్‌గా పి.హాశ్వంత్ కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సన్యాసయ్య విజయవాడకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయవాడ నుంచి పి.హాశ్వంత్ కుమార్‌ను నియమించారు. ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్తున్న ఇన్‌స్పెక్టర్ సన్యాసయ్యకు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కర్నూలు ఎయిర్‌పోర్టులో పని చేయడం సంతోషాన్ని కలిగించిందని సన్యాసయ్య అన్నారు. ఆయన సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో డీఈ అమృత్ కుమార్, ఏపీసీ ఇన్‌చార్జి బెజ్మెన్, ఎస్ఐ శివశంకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నీటి విడుదలకు నిర్ణయం



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

(5వ పేజీ తరువాయి)

గంగమ్మ చెరువును కాపాడాలని ఓ మహానాయకుడు (కర్నూలు మాజీ ఎంపీపీ డి.రాజవర్ధన్ రెడ్డి) నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించి న్యాయ పోరాటం చేశారని, ఆయన మరణానంతరం కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి న్యాయపోరాటం చేశారని గుర్తు చేశారు. సుదీర్ఘ విచారణ తరువాత చెరువు ఆక్రమణలు తొలగించి, చెరువును పునరుద్ధరించాలని గ్రీన్ ట్రిబ్యూనల్ తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పు మేరకు తక్షణమే చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, హంద్రీనీవా ఎస్ఈ పాండురంగయ్య, ఈఈలు ప్రతాప్, భాస్కరరెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, కేసీ కాలువ, ఎల్లెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి మాట్లాడుతూ.. ఆదోని సబ్ డివిజన్ మైనర్ ఇరిగేషన్‌లో డీఈఈ, నాలుగు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నెలలు గడుస్తున్నా ఇంకా భర్తీ చేయలేదన్నారు. ఇలాగైతే చెరువుల నిర్వహణ ఎలా ఉంటుందని అధికారులను ఆయన ప్రశ్నించారు.


పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఐఏబీ తీర్మానాలు ఇవి

- తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు ఈ నెల 10 నుంచి నీటిని విడుదల చేయాలని టీబీపీ బోర్డుకు ఇండెంట్ పెట్టాలి. 18వ తేది నుంచి పంట కాలువకుల నీటిని విడుదల చేయాలి. ఈ ఏడాది 35 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి.
- ఎల్లెల్సీ సరిహద్దులో 550/600 క్యూసెక్కులు నీరు వచ్చేలా ఆర్‌డబ్ల్యూఎస్, రెవిన్యూ అధికారులతో కలసి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
- కేసీ కాలువకు జిల్లాలో 3,763 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ నెల 14 నుంచి సుంకేసుల బ్యారేజీ నుంచి నీటిని ఇవ్వాలి. నంద్యాల ఐఏబీలో తుది నిర్ణయం తీసుకోవాలి.
- కర్నూలు నగరంలో హంద్రీ నది మురుగునీటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హంద్రీ నీవా కాలువ నాయకల్లు, లద్దగిరి వద్ద రెండు ప్రాంతాల్లో స్లూయిస్‌లు ఏర్పాటు చేసి హంద్రీ నదికి కృష్ణా జలాలు విడుదల చేయాలి. తద్వారా ముగురు లేకుండా చేయాలి.
- హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు దృష్ట్యా ఈ నెల 15 నుంచి మాల్యాల లిఫ్టు నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోయాలి. విస్తరణ చేయడంతో 3,850 క్యూసెక్కులు ఎత్తిపోయాలి.
- కర్నూలు నగరంలో వేసవి తాగునీటి ఇబ్బందులు దృష్ట్యా హంద్రీనీవా కాలువకు నీటిని ఎత్తిపోసిన నాటి నుంచి గాజులదిన్నె జలాశయానికి నీటిని విడుదల చేసి డ్యాంను నింపాలి. అలాగే.. హంద్రీనీవా, ఎల్లెల్సీ కాలువ కింద చెరువులను పూర్తి స్థాయిలో నింపాలి.
- జిల్లా పశ్చిమ ప్రాంతం కరువు, వలసలు శాశ్వత పరిష్కారానికి గుండ్రేవుల జలాశయం నిర్మాణం ఒక్కటే ఏకైక ఆధారం. గుండ్రేవుల జలాశయం, వేదవతి ప్రాజెక్టులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ నివేదిక పంపించాలి.

నిషేధిత ఫుడ్ కలర్స్ వాడితే చర్యలు

- ఆహార భద్రత అధికారి రాజగోపాల్



మాట్లాడుతున్న ఆహార భద్రత అధికారి రాజగోపాల్

కర్నూలు రాజ్‌విహార్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని, ఆహారంలో చోటు చేసుకునే కల్తీని గుర్తించాలని, నిషేధించిన ఫుడ్ కలర్స్ వాడితే చర్యలు తప్పవని జిల్లా ఆహార భద్రత అధికారి రాజగోపాల్ హెచ్చరించారు. కేవీజీవీఎం ఆధ్వర్యంలో ఒక్కరోజు ఫోస్టాగ్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం హోటల్స్, రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లు, స్వీట్ బేకరీలు, బిర్యానీ సెంటర్లు, కూల్‌డ్రింక్స్, మిల్క్ ఐస్‌క్రీం పార్లర్, కిరాణం, చికెన్, మటన్ దుకణాల యజమానులకు సూరత్ గ్రాండ్ హోటల్‌లోని సమావేశ భవనంలో ఏర్పాటు చేశారు. ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ యశోద హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీ, తదితర వాటిల్లో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి వ్యాపారి వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార భద్రత, నాణ్యత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఆహార సంబంధ వ్యాపారి ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికేషన్ పొంది ఉండాలన్నారు. భవిష్యత్తులో ఫోస్టాక్ సర్టిఫికెట్ లేని దుకాణాలు, హోటల్స్ తదితర ఆహార తినుబండారాలు విక్రయించే వారికి ఫుడ్‌లైసెన్స్ ఇవ్వకూడదని 2017 యాక్ట్ సెక్షన్ 55 చెబుతోందని గుర్తుచేశారు. ఈ కేవీజీవీఎం సౌత్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ ఇన్‌చార్జిలు మోహన్‌బాబు, సింధు, టీం హెడ్‌లు ఎస్.జాన్ పాల్, షారోన్, ఎగ్జిక్యూటివ్‌లు భతర్, అరుణ్ కుమార్, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన వీరభద్రగౌడ్


సీఎం చంద్రబాబుతో వీరభద్ర గౌడ్

కర్నూలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడు సోమవారం రాత్రి ఉండవల్లి సచివాలయంలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును కలిశారు. ఆలూరు టీడీపీలో చోటు చేసుకున్న తాజా పరిస్థితులను సీఎం చంద్రబాబుకు వివరించారు. ఇదిలా ఉండగా ఆలూరు టీడీపీ కీలక నేతల్లో నెలకొన్న విభేదాల నేపథ్యంలో సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహించేందుకు టీడీపీ అధిష్టానం ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, నియోజకవర్గ పరిశీలకుడు పూల నాగరాజులతో త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ ముగ్గురు నాయకత్వంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అధిష్టానం ఆదేశాల మేరకు వీరభద్రగౌడును ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పిస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబును గౌడ్ కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అందరూ కలసికట్టుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని, సమస్యలన్నీ పరిష్కరిస్తానని చంద్రబాబు తెలిపినట్లు సమాచారం. అదేవిధంగా ఆగిపోయిన బళ్లారి- జడ్చెర్ల జాతీయ రహదారి పనులు, దానాపురం-హోళగుంద రోడ్డు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వీరభద్ర గౌడ్ తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గిరి మల్లేష్‌గౌడు, నేమకల్లు రవి యాదవ్ తదితరులు ఉన్నారు

ఎరువుల కొరత లేకుండా చూడాలి


డీసీఎంఎస్ కేంద్రంలో ఎరువులను పరిశీలిస్తున్న చైర్మన్

- డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను కొరత లేకుండా చూడాలని డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ అధికారులు, సిబ్బందికి సూచించారు. కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో సోమవారం డీసీఎంఎస్ కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులను డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ రాజేష్‌తో కలిసి పరిశీలించారు. క్లర్క్ రాజీవ్ డీసీఎంఎస్ కేంద్రానికి వచ్చిన ఎరువులను, అదే విధంగా ఏయే గ్రామాల్లోని రైతులకు అందించాలో చైర్మన్‌కు వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఎవరూ కూడా ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్ పూర్తయ్యేదాకా యూరియా, డీఏపీ ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఎమ్మార్పీకే రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టామని, రైతులు ప్రైవేటు డీలర్ల వద్ద ఎక్కువ ధరకు కొని నష్టపోవద్దని సూచించారు. డీసీఎంఎస్ సంస్థను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

10న విచారణకు హాజరు కావాలి

- ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు నోటీసులు జారీ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎం.విజయలక్ష్మిదేవి ఈ నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలోని కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి. నాగప్రసన్న లక్ష్మి నోటీసులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మిపై వచ్చిన ఆరోపణలపై మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేష్ రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణకు వీరిద్దరూ హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న బీజేపీ


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కర్నూలు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రజా వ్యతిక విధానాలను అమలు చేస్తున్నదని, ఈ విషయాలు ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాసరెడ్డి సూచించారు. కర్నూలు నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నంద్యాల డీసీసీ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి జె.లక్ష్మీనరసింహ యాదవ్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా నాయకులు, కోఆర్డినేటర్లతో అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను ప్రతి కాంగ్రెస్ నాయకులు గ్రామ స్థాయిలో ప్రచారం చేసి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంతో పాటు నియోజవర్గాల్లో పార్టీ కార్యాలయాలు త్వరలో ప్రారంభమయ్యేలా కృషి చేస్తానన్నారు. ప్రజల్లో పార్టీపై నమ్మకం కలిగేలా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ కోఆర్డినేటర్లు, బూత్‌స్థాయి కమిటీలను పూర్తి చేయాలని కోరారు. కర్నూలు డీసీసీ నియామకంపై నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. చింతల మోహన్‌రావు, దాసరి చింతలయ్య, ఇస్మాయిల్, రజాక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బ్రతుకన్న, మహేంద్ర, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బజారన్న, కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, కేకేసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎజాజ్ అహ్మద్, సయ్యద్, నవీన్, సుజాత, ఎ.లలిత, హైమావతి పాల్గొన్నారు.

రైతు ఖాతాల్లో రూ.8 లక్షలు మాయం

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

హోళగుంద, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హెబ్బటం గ్రామానికి చెందిన రైతు కురువ రంగస్వామి బ్యాంకు ఖాతాల్లో రూ.8 లక్షలు మాయమయ్యాయి. దీంతో బాధిత యువరైతు పోలీసులను ఆశ్రయించారు. వివరాలివీ.. రంగస్వామి కొన్ని నెలల క్రితం 15 ఎకరాల పొలంలో పండించిన 400 బస్తాల బ్యాడిగి మిరపను గత నెల 24న కర్ణాటకలోని బ్యాడిగి మిరప మార్కెట్లో వ్యాపారులకు రూ.9.02 లక్షలకు విక్రయించారు. గతనెల 30వ తేదీన వ్యాపారులు రైతుకు సంబంధించిన ఆదోనిలోని బ్యాంకు ఆఫ్ బరోడా ఖాతాలో రూ.4.02 లక్షలు, కెనరా బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమ చేశారు.

బ్యాంక్‌లో ఉన్న నగదును డ్రా చేస్తే ఇంట్లో పెట్టుకోవడానికి బయపడి బ్యాంక్‌లోనే ఉంచారు. అయితే వారం రోజుల క్రితం సిమ్ బ్లాక్ అయింది. మూడు రోజుల క్రితం కొత్త సిమ్ కూడా తీసుకున్నారు. అయితే డబ్బులు అవసరం ఉండడంతో మొదటగా ఆదోనిలోని కెనరా బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేయగా రూ.లక్ష మాత్రమే ఉందని బ్యాంకు అధికారులు చెప్పారు. రూ.4 లక్షలు పలు దఫాల్లో కట్ అయినట్లు తెలిపారు. తర్వాత బాధిత రైతు బ్యాంకు ఆఫ్ బరోడాకు వెళ్లారు. అక్కడ కూడా బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేయగా రూ.4 లక్షలు కట్ అయినట్లు తెలిసింది. తమిళనాడు, మహారాష్ట్రలోని నాసిక్, కల్‌కత్తాలోని ఇతర బ్యాంకు ఖాతాలకు రూ.8 లక్షలను మళ్లించినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. బాధిత రైతు హోళగుంద పోలీసులను ఆశ్రయించారు.

రామ్‌కో పరిశ్రమ వద్ద ఉద్రిక్తత..

- చర్చలకు వచ్చిన రైతులను అడ్డుకున్న పోలీసులు
- నిరసనకు దిగిన సీపీఐ నాయకులు, రైతులు


సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద బైఠాయించిన రైతులు, సీపీఐ నాయకులు

కొలిమిగుండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై సోమవారం చర్చలు జరుపుతామని వారం క్రితం చెప్పిన రామ్‌కో పరిశ్రమ ప్రతినిధులు రైతులను ఆ ప్రాంగణంలోకి అనుమతించకపోవడంతో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, జిల్లా రైతు సంఘం నాయకులు సోమన్న ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున రామ్‌కో పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. అయితే పోలీసులు భారీగా మొహరించి, రైతులను పరిశ్రమ రహదారిలోకి కూడా అనుమతించకపోవడంతో వాగ్వాదం నెలకొంది. దీంతో సీపీఐ నేతలు, రైతులు అక్కడే బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం పోలీసుల జోక్యంతో ఐదుగురిని లోపలికి అనుమతించి చర్చలు జరిపారు. చర్చలు విఫలం కావడంతో సీపీఐ నేతలు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలన్న ఆలోచన పరిశ్రమ వర్గాలకు ఏమాత్రం కనిపించడంలేదని విమర్శించారు. గతంలో చెప్పినట్లే యజమాన్యానికి తెలియజేస్తామంటూ పాతపాటే పాడుతు న్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఎరువులు అందిస్తాం



రైతులతో మాట్లాడుతున్న ఏవో పవన్‌కుమార్

బండిఆత్మకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల అందిస్తామని, ఎవరూ ఆధైర్యపడవద్దని మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమారు అన్నారు. సోమవారం మండలంలోని ఏ కోడూరు సహకార సంఘంలో ఆయన ఎరువుల నిల్వలను పరిశీలించి, పంపిణీ, స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. అనంతరం సొసైటీ వద్ద రైతులతో ఏవో మాట్లాడుతూ యూరియా అవసరం మేరకు అందిస్తామని, గ్రామాల వారీగా ఎరువులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో శ్రీనువాసులు, సిబ్బంది బాషా పాల్గొన్నారు.

తప్పులను సరిచేయండి

బండిఆత్మకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ అధికారులు అన్నదాత సుఖీభవ అనర్హులను సరిచేయాలని తహసీల్దార్ పద్మావతమ్మ సూచించారు. సోమవారం ఏవో పవన్‌కుమార్‌తో కలసి వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండలంలో 766 మంది రైతులు అనర్హుల జాబితాల్లో ఉన్నారని, రీ సర్వే, ఇనాం లాంటి తప్పిదాలను తక్షణమే సరిచేయాలని, నిర్లక్ష్యం తగదని ఆమె హెచ్చరించారు. సమావేశంలో డీటీ గురునాధం పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై జాబితాలో పేర్లు లేని రైతులు ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏవో కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ ఎరువుల దుకాణాల్లో యూరియా 75టన్నులు, కాంప్లెక్స్ ఎరువు187 టన్నులు, డీఏపీ 20టన్నులు ఉన్నాయని అన్నారు. ఈ ఏడాది పంటబీమా పథకానికి ప్రీమియం ఈనెల 15వరకు గడువు ముగుస్తుందని అన్నారు. ప్రతి రైతు ప్రధానమంత్రి పసలయోజన బీమా పథాకనికి బీమా చేయించుకోవాలని అన్నారు.

నేడు జాబ్ మేళా

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి సోమశివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధికల్పనాధికారి మాట్లాడుతూ మంగళవారం నిర్వహించే ఉద్యోగమేళాలో ఫ్యూజియన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీ రూ.17వేల వేతనంతో రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టులు, పేటీఎం కంపెనీ రూ.18వేల వేతనంతో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్ పోస్టుల భర్తీకి ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్‌తో పాటు ఎల్ఎల్ఆర్ లేదా డ్రైవింగ్‌లైసెన్స్ అర్హత కలిగి ఉండాలని, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఉన్నత చదువు చదివిన నిరుద్యోగులు కూడా ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చని తెలిపారు. 18 నుంచి 32 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు.

కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆర్వో ప్లాంట్ మరమ్మతుకు నోచుకోవడం లేదన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఉడికి ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, నాసిరకం కోడిగుడ్లు విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆది, డివిజన్ కోశాధికారి శ్యామ్ నాయక్, డివిజన్ నాయకులు జగన్, అజయ్, సురేష్, జగన్, జస్వంత్, అశోక్ పాల్గొన్నారు.

ఫోటో నెం 2 :పాణ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

పాణ్యం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో నంద్యాల ఈగల్ సిబ్బంది ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, తదితర మత్తు పదార్థాలను వాడినా, అమ్మినా రవాణా చేసినా చట్టరీత్యా నేరమన్నారు. ఒక్కసారి కేసు నమోదైతే జీవితం నాశనమైపోతుందన్నారు. మత్తుపదార్థాల సమాచారం తెలిసిన వారు ఈగల్ టోల్‌ఫ్రీ నంబరు 1972కు, లేదా 8977781972కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రఫీక్, ఈగల్ సిబ్బంది మనోహర్, ప్రసాద్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

పాణ్యం, జూలై7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరుకుచెందిన దివంగత జి. సుబ్రహ్మణ్యం కుటుంబానికి తన తోటి పూర్వవిద్యార్థులు సోమవారం చేయూతనందించారు. నందివర్గంలో 2008లో పదవ తరగతి చదివిన సుబ్రహ్మణ్యం ఇటీవల గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందడంతో తోటి పూర్వ విద్యార్థులు సుబ్రహ్మణ్యం కుటుంబానికి చేయూతనందించారు. సుబ్రహ్మణ్యంకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తోటి పూర్వ విద్యార్థులు సుబ్రహ్మణ్యం కుమార్తెల భవిషత్తు కోసం రూ. 51 వేలు సేకరించి ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు.

కుందూకు జలకళ

బండిఆత్మకూరు జూలై7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కుందూనది సూమారు నెల రోజులు ముందుగానే జలకళ సంతరించుకుంది. శ్రీశైలం డ్యాంకు దాదాపు 880 అడుగులకు చేరుకోవడంతో ప్రజాప్రతినిధులు పోతిరెడ్డిపాడు, బనకచర్ల వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని సంతజూటూరు ఆనకట్ట వద్దకు నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కాకనూరు వద్ద ప్రవహిస్తున్న కుందూనది

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

నెలరోజులైనా భర్తీ కాని పోస్టులు
ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
పట్టించుకోని అధికారులు



కొత్తపల్లి జడ్పీ హై స్కూల్ పాఠశాల



కొత్తపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో జిల్లా పరిషత్ హై స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమై నెల రోజులు కావస్తున్నా నేటికి పాఠశాలలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించలేదు. ప్రధానంగా గోకవరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 3 నుంచి 10వ తరగతి వరకు 158 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ 3, 4, 5, 6 తరగతులకు సంబంధించి మూడు ఎస్‌జీటీ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 6 నుంచి 10వ తరగతి వరకు బోధించే ఒక సోషల్ ఉపాధ్యాయ పోస్టు కూడా ఖాళీగా ఉంది. అంతేగాకుండా కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 270 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ కూడా సోషల్, ఇంగ్లీషు సబ్జెక్టులతో పాటు రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లు పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ఉపాధ్యాయులను నియమించాలి



మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి. మండలంలో ఇప్పటికే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గింది. అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలి.

- దినేష్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

మెప్మా ఆర్పీల పనితీరు మెరుగుపడాలి: ఎమ్మెల్యే



మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా రీసోర్స్ పర్సన్ల పనితీరు మెరుగుపడాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 42 ఎల్ఎల్ఎఫ్ సంఘాలు ఉండగా ఇప్పటివరకు కేవలం 36 సంఘాలు మాత్రమే ఉన్నాయని, మిగతా వాటిని కూడా త్వరగా భర్తీ చేయాలని అన్నారు. కొంత మంది ఆర్పీలు పొదుపు సంఘాలకు ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిలో మార్పు రావాలని అన్నారు. ప్రతి ఎస్ఎల్ఎఫ్ పరిధిలో డీజీలక్ష్మీ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తులు రావాలని, ఇందుకు ఆర్పీలు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పొదుపు సంఘాల విషయంలో తాను రాజకీయాలకు అతీతం గా వ్యవహరిస్తానని, ఎవరైనా.. ఈ సంఘాలపై రాజకీయ రం గు పులిమితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఘాటుగా హెచ్చరించారు. అనంతరం ఆర్పీలకు ప్రభుత్వం నుంచి జారీ చేసిన ట్యాబులు, డీజీలక్ష్మీ సెంటర్ల నిర్వాహకులకు పలు పరికరాలను పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ రమేష్‌బాబు, మెప్మా టీఎంసీ వెంకటేశ్వర్లు, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, నాయకులు నాగూర్‌ఖాన్ ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



వీపనగండ్ల గ్రామంలో సక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



పథకాల గురించి వివరిస్తున్న మల్లెల రాజశేఖర్

మిడుతూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని వీపనగండ్ల, తిమ్మాపురం గ్రామాల్లో సుపరిపాలన- తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించి కరపత్రాలను అందించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వీపనగండ్ల గ్రామంలో దళితకాలనీలో సీసీ రోడ్డు వేస్తామన్నారు. చెరుకుచెర్ల గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాతా జయమ్మకు రూ.87183 చెక్కును, పేరెడ్డి విజయలక్ష్మీకి రూ.70000 చెక్కును ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద రెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, టీడీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, నరసింహగౌడు, వేణుగోపాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గోస్పాడు: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకుతీసుకెళ్లడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం యాళ్లూరు గ్రామంలో ఇంటింటికివెళ్లి ప్రభుత్వ పథకాలు, ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, గ్రామ టీడీపీ నాయకుడు గంగుల వెంకటరెడ్డి, అరవిందప్రసాద్, కృపాకర్, బుగ్గరాముడు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన కొనసాగించేందుకు ప్రజల మద్దతే ప్రామాణికమని టీడీపీ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మండల పరిధిలోని కానాల గ్రామంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌తో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. ప్రజాసంక్షేమాన్ని కొరుకునే ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనీఫ్, బాబు, మదార్‌సాహెబ్ తదితరులు ఉన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి



శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డాకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేసే ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలను పెంచాలని సీఐటీయూ నాయకులు రణధీర్, రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, నాగరాజులు పేర్కొన్నారు. సోమవారం తమ డిమాండ్ల సాధన కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సందర్శించారు. దీంతో మున్సిపల్ కార్మికులు వారి సమస్యలను ఎమ్మెల్యే బుడ్డాకు వివరించారు. కార్మికులను బానిసల్లా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని చెప్పారు. అప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని తెలిపారు. గతంలో చేపట్టిన సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కార్మికులకు పెండింగ్ పీఎఫ్ బకాయిలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ప్రసాద్, జయన్న, తిమ్మయ్య, రాజేష్, వినోద్, సువర్ణమ్మ ఉన్నారు.

కొత్తూరులో పూజలు



కార్మిక సంక్షేమ శాఖ చైర్మన్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జయప్రకాష్ నారాయణ పూజలు నిర్వహించారు. సోమవారం ఆయనకు ఆలయసిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆయనకు పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు సురేష్ శర్మ పాల్గొన్నారు.


వైభవంగా పల్లకీ సేవ



మహానందిలో పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం సోమవారం రాత్రి పల్లకి సేవ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణమంటపంలో పార్వతీ పరమేశ్వర్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు గావించారు. అనంతరం ఆలయ మెదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పార్వతీ పరమేశ్వర్ల పల్లకి సేవ ఉత్సవం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మతో పాటు అర్చకులు పుల్లూరి జనార్దన్‌శర్మ పాల్గొన్నారు.

రైతులు ఆధునిక వ్యవసాయంపై ఆసక్తి చూపాలి



రైతుకు డ్రోన్ పరికరాన్ని అందజేస్తున్న ఎంపీపీ యశస్విని

మహానంది, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పాత వ్యవసాయ విధానానికి స్వస్తి పలికి మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలని మహానంది మండలాధ్యక్షురాలు యశస్విని తెలిపారు. సోమవారం మండలంలోని సీతారామపురం గ్రామంలో రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద డ్రోన్ పరికరాన్ని భువన రైతు గ్రూపుకు ఎంపీపీ పంపిణీ చేశారు. డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో కేవలం ఎకరాకు ఆరు నిమిషాల్లో పురుగుల మందు పిచి కారి చేయవచ్చునన్నారు. తద్వారా పురుగులు, తెగుళ్లను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, ఈవోఆర్డీ నాగేంద్రుడుతో పాటు రైతులు పాల్గొన్నారు.

15 తేదీలోగా అరటి పంటకు బీమా చేసుకోండి

మహానంది, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అరటిపంట సాగు చేసే రైతులు 15 వతేదీ లోగా వాతవరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని నమోదు చేసుకోవాలని ఉద్యానవనశాఖాధికారి బి. శ్రీధర్ సోమవారం తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంక్ పాసుపుస్తకాలు జిరాక్స్ పత్రాలతో కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవా కేంద్రాల్లో ఎకరాకు రూ.2750 చెల్లించి బీమా నమోదు చేసుకోవాలన్నారు. పంట నష్టపోతే బీమా ద్వారా ఎకరాకు రూ. 50వేల వరకు నష్టపరిహారం అందుతుందని తెలిపారు.

శ్రీశైలంలో విరాళాలు



విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణకు, ప్రాణదాన ట్రస్టుకు పలువురు భక్తులు విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మీప్రసన్న కాంట్రాక్టింగ్ సంస్థ రూ.5లక్షలను దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత ప్రాణదాన ట్రస్టుకు విరాళంగా అందజేశారు. యాదాద్రి భువనగిరికి చెందిన రాజేంద్రప్రసాద్‌రెడ్డి రూ.1,00,293లను అన్నప్రసాద వితరణకు విరాళం అందజేశారు. ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందు విరాళాలను స్వీకరించి రశీదును, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

శ్రీశైలం పంచమఠాల్లో ప్రత్యేక పూజలు



మొక్కలు నాటుతున్న ఆలయ ఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్ర జ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలోని పంచమఠాల్లో ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాల్లో విశేష అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు, సిబ్బందితో కలిసి ఈవో మఠాల ఆవరణల్లో దేవతా మొక్కలను నాటారు.

10న అమ్మవారికి శాకంబరి ఉత్సవం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో 10న ఆషాడపౌర్ణమి సందర్భంగా భ్రమరాంబాదేవి అమ్మవారికి శాకంబరి ఉత్సవం జరుగుతుందని ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈవో మాట్లాడుతూ ఉత్సవంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ రకాల కూరగాయాలు, ఆకుకూరలతో విశేషంగా అలకరించడం జరుగుతుందని తెలిపారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



పూలేకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, నాయకులు

పాణ్యం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మహిళ విద్యకు కృషి చేసిన సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా విద్యార్థులు ఘన నివాళులర్పించారు. సోమవారం పాణ్యం డిగ్రీ కళాశాలలో సమాజ్ వాది పార్టీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పరీదా, బీసీ సంఘం నాయకులు మద్దయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, గోపాలస్వామి, వెంకటనాయుడు, సుబ్బయ్య పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పాములపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణ దారులు ఎరువులను అధిక ధరలకు విక్రయస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం పాములపాడులోని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల ఎరువుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూరియా కొరత సృష్టించరాదని, ఎరువులు కొనాలంటే పురుగు మందులు కొనాలని మెలిక పెట్టరాదని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నల్లకాలువ గ్రామంలో బైర్లూటి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి 45 మందికి చికిత్సలు నిర్వహించారు. అలాగే గర్భవతులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమార్, పంచాయతి కార్యదర్శి బాలు నాయక్, సర్పంచ్ వెంకటరమణ,ఆరోగ్య సిబ్బంది,సచివాలయ సిబ్బందిలు పాల్గొన్నారు.

పశుగ్రాస క్షేత్రాలను సద్వినియోగం చేసుకోండి

గడివేముల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం అందించే పశుగ్రాస క్షేత్రాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా చిందుకూరు, బూజనూరు గ్రామాల్లో సోమవారం పాడి రైతులకు పశుగ్రాస క్షేత్రాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి రైతు 10 నుంచి 50 సెంట్ల వరకు పశుగ్రాసం పెంచుకోవచ్చని అన్నారు. పాడి పశువులకు సరైన పశుగ్రాసం అందించడం వల్ల పాడి ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ కమలాకర్, పశువైద్యాధికారి సాయిహరిణి, పావని పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం



నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

కొత్తపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగు గ్రామంలో మొహర్రం సోమవారం ముగిసింది. సాయంత్రం పీర్లను అగ్ని గుండం చుట్టూ ఊరేగించి అనంతరం నది ఒడ్డునకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వెలుగోడు: మండలంలోని బోయరేవుల గ్రామంలో మొహర్రంను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లను భారీ డప్పులమధ్య గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను గ్రామ నాయకులు కొండ, క్రిష్టారెడ్డి, ఎల్లస్వామి, చాకలి మహేశ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. పీర్లను ఏటికి తరలించి నిమజ్జనం నిర్వహించారు.

పుస్తకాల పంపిణీ

గడివేముల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరటమద్ది గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యాధన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యాధన్ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపకులు వెంకటేశ్వర్లు విద్యార్థులకు రూ.5 వేలు విలువ చేసే పుస్తక సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, విశ్రాంత హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయులు యోగేశ్వరుడు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రైతు కష్టాలు తెలిసిన సీఎం చంద్రబాబు

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైతు కష్టాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుసని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆచారి కాలనీలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింకి వెళ్లి ఏడాదిలో అమలు చేసిన ప్రభుత్వ పథకాలు వివరించారు. రాబోమో రోజుల్లో మరిన్ని పథకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బద్రి సుధాకర్‌రెడ్డి, హుసేన్‌బాష, నాయకులు రామాచారి, శ్రీకాంత్‌రెడ్డి, బడకండ్ల రామశేఖర్‌రెడ్డి, భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాట్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

● ప్రజా వేదికలో ఆర్డీవోకు జర్నలిస్టుల వినతి


ఆర్డీవోకు వినతి పత్రాన్ని ఇస్తున్న జర్నలిస్టులు

డోన్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమ ప్లాట్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరారు. సోమవారం ప్రజావేదికలో ఆర్డీవో నరసింహులుకు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో డోన్ జర్నలిస్టులు వి.నాగరాజు, విజయమోహన్ నాయుడు శివరామచారి, వెంకటేశ్వర్లు, నాగరాజు, సుధాకర్, అంజి, శేఖర్ మురళి, మణిధర్, జర్మియా, నాగరాజు, వలిబాషా, రంగారెడ్డి, గోపికృష్ణ, జగన్, సుధాకర్, రామయ్య, చిన్న సుధాకర్ ఉన్నారు.

రైతుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు

అవుకు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల నుంచి ఫిర్యాదులు అందితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్ హెచ్చరించారు. సోమవారం అవుకు - 2 రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కలిమున్నిసాతో కలసి డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి డీలర్ రైతులకు ఎరువులను డీబీటీ మిషన్ ద్వారా పంపిణీ చేయాలన్నారు. నకిలీ, గడువు ముగిసిన పురుగు మందులు విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

తప్పులను సరిదిద్దాలి

రుద్రవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అన్నదాత సుఖీభవ పథకం రైతుల జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దాలని తహసీల్దారు మల్లికార్జునరావు గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

పకడ్బందీగా సామాజిక తనిఖీ నిర్వహించాలి


మాట్లాడుతున్న భాస్కర్

చాగలమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరగనున్న సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ భాస్కర్ తెలిపారు. సోమవారం ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏలు, డీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను కేటాయించిన రూ.11 కోట్లు నిధులు 19 గ్రామ పంచాయతీల్లో 1500 పనులకు ఖర్చు చే శారన్నారు. ఈ పనులపై డీఆర్పీలతో విచారణ చేయడం, గ్రామ సభలు నిర్వహించి నివేదికలను సమర్పించాలని అన్నారు. సమావే శంలో పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

నిధులు మంజూరు

చాగలమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు నిర్మించేందుకు నిధులు మంజూరైనట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. చాలమర్రి 3, 10 అంగన్‌వాడీ కేంద్రాలకు, మద్దూరు, కేపీ తండా, పెద్దవంగలి, చిన్నబోధనం, రాంపల్లె, నేలంపాడు, చక్రవర్తులపల్లె గ్రామాల అంగన్‌వాడీల్లో టాయిలెట్లు నిర్మించనున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు.

రైన్ పరిశ్రమకు జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న సీజీఎం

ప్యాపిలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల రైన్ సిమెంటు పరిశ్రమకు జాతీయ స్థాయి ఫైవ్ స్టార్ అవార్డు లభించింది. సోమవారం రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్స వంలో సీఎం భజన్ లాల్ శర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నుంచి రైన్ పరిశ్రమ సీజీఎం మల్లికార్జునరెడ్డి అవార్డును అందజేశారు. గనుల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులు పాటించడం వలన అవార్డు వచ్చినట్లు సీజీఎం తెలిపారు. మైన్స్ డీజీఎం నాగ తులసిరెడ్డి, పీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


జెండావిష్కరణలో పాల్గొన్న వీఆర్ లక్ష్మీరెడ్డి, ఎమ్మార్పీస్ నాయకులు

చాగలమర్రి/రుద్రవరం/డోన్ టౌన్/కొలిమిగుండ్ల/సంజామల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనం గా నిర్వహించారు.ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేశారు. కేక్ కట్ చేశారు.నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌తో వర్గీకరణ సాధ్యమైందన్నారు. స్థానిక నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ

బనగానపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో పాండురంగారెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డితో పాటు భక్తులు, పూజారులు పల్లకీలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

పశువైద్యంపై చిన్నచూపు

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- మూగజీవాలకు అందని వైద్యం
- దిష్టిబొమ్మలా పశు వైద్యశాలలు

కొలిమిగుండ్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. వ్యవసాయం తరువాత రైతన్నకు ప్రధాన జీవనాధారమైన పాడి పరిశ్రమ. మండలంలోని పాడి రైతులకు ప్రోత్సాహకం కరువైంది. ఒక్క పశు వైద్యుడు కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులకు అందాల్సిన సేవలు అటకెక్కాయి. దీంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మూగ జీవులకు రోగమొస్తే సేవలందక ప్రాణాలు విడిచే దయనీయ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పశువైద్యశాలలు అందుబాటులో ఉన్నా క్షేత్ర స్థాయిలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. మండలంలో 23గ్రామ పంచాయతీలు, 32గ్రామాలు ఉన్నాయి. ఇందులో సుమారు 15వేల వరకూ పాడి పశువులు, 1వెయ్యికి పైగా ఆవులు, ఎద్దులు, 1.20లక్షలు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటితో పాటు గాడిదలు, కుక్కలు, కోళ్లు ఇలా విభిన్న పశు సంపద ఉంది. వీటి వైద్యం కోసం కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో మెయిన్ పశు వైద్యశాలలు, తిమ్మనాయినిపేట, ఎర్రగుడి, చింతలాయపల్లె గ్రామాల్లో సబ్ సెంటర్లు ఏర్పాటుచేశారు.. మెయిన్ పశువైద్యశాలల్లో ప్రస్తుతం వైద్యులుగానీ, సిబ్బంది కానీ అందుబాటులో లేరు.



మూసివేసిన కొలిమిగుండ్ల పశువైద్యశాల

తెరిచి ఉంచే దిక్కు కరువయ్యారు..

ఐదు నెలల క్రితం కొలిమిగుండ్ల పశువైద్యాధికారిణి పద్మావతి సుదీర్ఘ సెలవులపై వెళ్లడంతో అంకిరెడ్డిపల్లె వైద్యున్ని కొలిమిగుండ్లకు ఇన్‌చార్జిగా నియమించారు. ఇటీవలే ఆయన కూడా బదిలీపై వెళ్లారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేక పశు వైద్యసేవలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ప్రధాన పశు వైద్యశాలల్లో కనీసం జేవీవో, ఎల్ఎస్‌వో, అటెండర్ వంటి కిందిస్థాయి అధికారులు, సిబ్బంది కూడా లేకపోవడంతో పశువైద్యశాలలు తెరిచి ఉంచే నాథుడే కరువయ్యారు. ఇక సబ్ సెంటర్లలో జేవీవోలు అందుబాటులో ఉన్నా పర్యవేక్షణ లేక సేవలు అందని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఉంటారో, ఎప్పుడు ఉండరో కూడా తెలియని పరిస్థితి.



వైద్య సేవలు అందని అంకిరెడ్డిపల్లె పశువుల ఆసుపత్రి

అరకొరగా మందులు

పాడి రైతులు, గొర్రెల కాపరులకు పూర్తిస్థాయిలో మందులు అందని పరిస్థితి నెలకొంది. అరకొరగా అందుబాటులో ఉన్న గోపాలమిత్రలు గ్రామాలకు వెళ్లి కొంత మేర పాడి రైతులకు సహకారం అందిస్తున్నారు. పశువుకు అనుకోకుండా రోగమొస్తే, అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో లేక పశువులు చనిపోయే పరిస్థితి నెలకొందని పశు పోషకులు వాపోతున్నారు. మండలంలోని నందిపాడు, కల్వటాల, ఎర్రగుడి, నాగిశెట్టిపల్లె, తోళ్లమడుగు, పేట్నికోట, అబ్దులాపురం, కోటపాడు, తిమ్మనా యినిపేట గ్రామాల్లో చాలా కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈపరిస్థితుల్లో పశు వైద్యసేవలు మృగ్యంగా మారడం రైతులకు ఆందోళన కలిగి స్తోంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, పశువైద్య సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

పశు వైద్యులను నియమించాలి



ప్రభుత్వం పశు వైద్యులను నియమించాలి. గొర్రెల కోసం వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటుగా చూపించాల్సిన పరిస్థితి. మందులు ఉచితంగా అందించాలి.

● శ్రీనివాసులు, గొర్రెల యజమాని, మీర్జాపురం

త్వరలో వైద్యులను నియమిస్తాం

అంకిరెడ్డిపల్లె ఆసుపత్రికి ఇటీవల డాక్టరును నియమించాం. ఆమె సెలవుపై వెళ్లింది. వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. త్వరలో కొత్త వైద్యులను నియమిస్తాం. సమస్యలు పరిష్కరిస్తాం.

● డాక్టర్ కొండారెడ్డి, ఏడీ

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి


మాట్లాడుతున్న నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్

చాగలమర్రి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె గ్రామంలో మంగళవారం జరిగే పీర్ల ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీవో విశ్వనాథ్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా పార్టీ నాయకులు, గ్రామ పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక మొహర్రం అన్నారు. గ్రామంలో అందరు కలిసి మెలసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. పీర్ల ఊరేగింపులో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


హెచ్.కొట్టాలలో కోట్ల దంపతులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

బేతంచెర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు సుపరిపాలన సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని హెచ్.కొట్టాల, కొమ్మరి కొట్టాల, గోర్లగుట్ట గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల దంపతులు పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. హెచ్.కొట్టాల గ్రామంలో టీడీపీ నాయకులు, ప్రజలు కోట్ల దంపతులకు స్వాగతం పలికి భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయంలో కోట్ల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి, మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, సుధాకర్, వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ మాజీ ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, నాయకులు ఎండూరి మహేష్, కోమల యోగేంద్రబాబు, రఘు, కుల్లోతమ్మరావు, వెంగన్న, శ్రీరాములు, మద్దిలేటి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నాపరాళ్ల ఫ్యాక్టరీల యజమానుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నాపరాళ్ల ఫ్యాక్టరీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గౌరీ హుశేన్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలు విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఫ్యాక్టర్ల యజమానులందరూ కలిసి వస్తే సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు.

వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో వినతి

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్ కోరారు. సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం

● పీర్ల ఊరేగింపు
● తరలి వచ్చిన ప్రజలు

ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్ : డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో వారం రోజుల పాటు సాగిన మొహర్రం ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు పలు రకాల వేషాలు ధరించి చావిళ్ల వద్ద సందడి చేశారు. సాయంత్రం పీర్లను ఊరేగింపుగా వీధుల్లోకి తీసుకవచ్చారు. ప్రజలు కులమతాలకు అతీతంగా తరలివచ్చి పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. పీర్లను తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


రుద్రవరంలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు


సంజామలలో పీర్ల గ్రామోత్సవం


అవుకులో..

ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేయాలి


ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కృషి చేయాలని డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన రెండు అపాచి ద్విచక్రవాహనానలను పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాతో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లైఓవర్ కింద వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశామని, ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. ప్రజలు అవగాహన కల్పించి క్రమపద్ధతిలో వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాకేష్, హెడ్ కానిస్టేబుల్ శివశంకర్, హోంగార్డ్స్ నాగరాజు, సుధాకర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

అహోబిలేశుడికి తిరుమంజనం


శ్రీదేవి భూదేవి సమేత ప్రహ్లాద వరద స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో సోమవారం శ్రీదేవి భూ దేవి సమేత లక్ష్మీనరసింహ స్వామికి నవకలశ పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి ఆధ్వర్యంలో ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు నవకలశ పూర్వ పంచామృతాలతో విశేష జ్యేష్టాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు.

11న వైద్య శిబిరం

డోన్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11న విభిన్న ప్రతిభావంతులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు, వయో వృద్ధులకు ప్రభుత్వం నుంచి ఉచితంగా అందించే ఉపకరణాల కోసం వైద్యశిబిరంలో అర్హులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ప్యాపిలి, బేతంచర్ల, డోన్ మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు తమ సరిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): డోన్ పేరంటాలమ్మ గుడి సబ్ స్టేషన్ వద్ద 33 కేవీ లైన్ సిఫ్టింగ్ కారణంగా మంగళ, బుధవారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈఈ నాగేంద్ర, ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు

బనగానపల్లె, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమికి ఏకైక ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక సభ్యుడు రామచంద్రుడు అన్నారు. సోమవారం మండలంలోని నందివర్గంలో త్రైతసిద్ధాంతంపై ప్రచారం చేసి శ్రీకృష్ణుని గొప్పదనం గురించి వివరించారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

డోన్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని వెంకటాపురం టీడీపీ నాయకులు కె. పవన్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. నాయకులు బోయ శేఖర్, బోయ అశోక్, యాగంటి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

డోన్ రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు నారాయణ, మోటరాముడు కోరారు. సోమవారం పట్టణంలోని సీపీఐ సర్కిల్ నుంచి ఏఐటీయూసీ ప్రజా సంఘాలతో పట్టణ ప్రధాన కూడళ్ల ప్రాంతాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, అబ్బాస్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పాత బస్టాండు నుంచి కొత్తబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు రామాంజనేయులు, ఎల్లయ్య, సుబ్బరాయుడు, వైబీ వెంకటేశ్వర్లు, ఖాజా, ఎస్కే బాషా, టింగు, నాగరాజు పాల్గొన్నారు.

బంకుల యజమానులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డోన్ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ పిల్లర్ల మధ్యలో అక్రమంగా బంకులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుం టున్న యజమానులకు నోటీసులు జారీ చేశామని కమిషనర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు. గత నెల 28న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రభుత్వ స్థలం కబ్జా'కథనానికి అధికారులు స్పందించి నోటీసులు జారీ చేశారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, జూలై 7, (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే ఆరోగ్యంగా ఉండాలని, ఇందుకు ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయుష్ డాక్టర్ షబానా సూచించారు. సోమవారం పట్టణంలోని కొండపేటలోని తెలుగుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు , విద్యార్థులు ఆయూష్ సిబ్బంది మాధవి, తిరుమలేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల వైద్య శిబిరం

బనగానపల్లె, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు, వయో వృద్ధులకు సహాయ పరికరాలు ఉచితంగా అందజేసేందుకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగరాజు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేర్లు నమోదు చేయించుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ పథకం' జాబితాల్లో పేర్లు లేని రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి జాబితాను తయారు చేసి రైతు సేవా కేంద్రాల్లో ఉంచామన్నారు.పేర్లు లేకుంటే గ్రామ వ్యవసాయాధికారికి అర్జీలు ఇచ్చి నమోదు చేయించుకోవాలని తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటియు జిల్లా నాయకులు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యేక సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 9న దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కారు డ్రైవరు యూనియన్ నాయకులు కోకిల సుధాకర్, నాగరాజు, గిరి, రమణ, శేఖర్ పాల్గొన్నారు.

కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కౌలురైతులు కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు రైతులకు అందుబాటులో కౌలుకార్డులు ఇప్పించేందుకు సహకరించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య, వీఆర్వోలు నాగమద్దిలేటి, బాలమద్దిలేటి, పుల్లయ్య, రాజశేఖర్, సుజాత పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయండి

కొలిమిగుండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఈనెల 10న ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో అబ్దుల్‌కలాం పేర్కొన్నారు. సోమవారం కొలిమిగుండ్ల జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యా శక్తి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం కొండప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మెగా కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కంటి వైద్య సహాయ నిపుణుడు పులిపాటి గోపాల్ వెల్లడించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కడప పుష్పగిరి ఆసుపత్రికి తీసుకవెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు.